https://epaper.manasamajam.com Contact No. 9989788438, 9505285656

# మన సమాజం

తెలుగు డిజిటల్ దిన పత్రిక

Truth towards the Society

చైర్మెన్ : పార్వతి సురేష్ కుమార్ ఎడిటర్ : పార్వతి రాజేష్ కుమార్

సంపుటి : 01 సంచిక : 216 సోమవారం 20-10-2025 పేజీలు : 4 వెల : 2 రూ/..

రిపోర్టర్స్ కావలెను

మన సమాజం

Truth towards the Society

మన సమాజం తెలుగు డిజిటల్ దినపత్రికలో

నిఖార్సైన జర్నలిస్టుగా నిలబడాలనుకుంటున్నారా?

అన్ని తరహా వార్తలు, కథనాలు ఎలాంటి ఆంక్షలు లేకుండా రాయాలని కోరుకుంటున్నారా?

తెలంగాణ వ్యాప్తంగా అన్ని జిల్లాలు, మండలాలల్లో పనిచేసేందుకు విలేఖరులు కావలెను...

మీ కలాలకు పదును పెట్టండి.

సంప్రదించవలసిన నెంబర్లు

9989788438, 9505485656.

# 21 ఏళ్లకే ఎమ్మెల్యే!



- పార్లమెంటులో చట్ట సవరణ చేయాలి
- గాంధీ పేరు దేశానికి పర్యాయపదం
- మతతత్వవాదులు బ్రిటిషర్ల కన్నాప్రమాదం
- జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్‌పై కుట్ర
- బీఆర్ఎస్, బీజేపీ మధ్య చీకటి ఒప్పందాలు
- రాజీవ్ సద్భావన సంస్మరణలో ముఖ్యమంత్రి

**హైదరాబాద్, అక్టోబరు 19:** దేశ భవిష్యత్తును యువత నిర్ణయించాలనే ఉద్దేశంతో మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ ఓటుహక్కు వయసును 18 ఏళ్లకు తగ్గించారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. ఇప్పుడు అదే స్ఫూర్తితో చట్టసభలకు పోటీ చేసే అర్హత వయసును కూడా 21 ఏళ్లకు తగ్గించాల్సిన అవసరం ఉందన్నారు. దేశ పరిపాలనా యంత్రాంగంలో 21 ఏళ్లకు ఐఏఎస్, ఐపీఎస్ అధికారులుగా కీలక పాత్ర పోషిస్తున్నప్పుడు అసెంబ్లీకి పోటీ చేసే వయసును 21 ఏళ్లకు ఎందుకు తగ్గించరాదని ప్రశ్నించారు. అందుకే ఎమ్మెల్యేగా పోటీచేసే అర్హత వయసును 25 ఏళ్ల నుంచి 21 ఏళ్లకు తగ్గిస్తూ త్వరలో రాష్ట్ర శాసనసభలో తీర్మానం చేస్తామన్నారు. ఇందుకు సంబంధించి పార్లమెంటులో చట్టసవరణ చేస్తే.. రాజకీయాల్లో యువత మరింత క్రియాశీలంగా మారుతుందని చెప్పారు. ఆదివారం మాజీ ప్రధానమంత్రి రాజీవ్‌గాంధీ సద్భావనా యాత్ర సంస్మరణ దినోత్సవం సందర్భంగా చార్మినార్ వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమానికి సీఎం రేవంత్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, "గాంధీ పేరు దేశానికి పర్యాయపదం. తమపై పోరాడిన మహాత్మాగాంధీని బ్రిటిషర్లు ఏమీ చేయలేకపోయారు. స్వాతంత్ర్యం వచ్చిన కొద్ది నెలల్లోనే మతతత్వవాదులు ఆయనను పొట్టన పెట్టుకున్నారు. గాంధీని హత్య చేసినవారు బ్రిటిషర్ల కంటే ప్రమాదకరమైన వ్యక్తులు. దేశ సమగ్రతను, సమైక్యతను కాపాడటానికి గాంధీ, ఇందిర, రాజీవ్ ప్రాణాలు కోల్పోయారు" అని రేవంత్ అన్నారు. గాంధీ కుటుంబం దేశంలో శాంతి, సామరస్యాన్నికాపాడుతోందని, మూడు తరాలుగా దేశం కోసం పని చేస్తోందని తెలిపారు. దేశాన్ని విచ్ఛిన్నం చేసేందుకు కొన్ని శక్తులు ప్రయత్నిస్తున్నాయని, ఇలాంటి పరిస్థితుల్లో రాహుల్‌గాంధీ భారత్ జోడో యాత్ర నిర్వహించారని పేర్కొన్నారు. రాహుల్ గాంధీని స్ఫూర్తిగా తీసుకుని ఎస్సీ వర్గీకరణతో పాటు కులగణన చేశామన్నారు.

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో బీఆర్ఎస్, బీజేపీ చీకటి ఒప్పందాలతో కాంగ్రెస్‌పై కుట్రలు చేస్తున్నాయని సీఎం రేవంత్ ఆరోపించారు. ఈ కుట్రలు, కుతంత్రాలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. బీజేపీకి బీఆర్ఎస్ బీ టీమ్‌గా మారిందని, బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు రాకపోవడానికి కూడా ఈ రెండు పార్టీలే కారణమని అన్నారు. 2024 పార్లమెంట్ ఎన్నికల్లో ఎనిమిది స్థానాల్లో బీఆర్ఎస్ ఓట్లు బీజేపీకి పడ్డాయన్నారు. "అసెంబ్లీ ఎన్నికల్లో 37 ఓట్లు సాధించిన బీఆర్ఎస్.. ఆ తర్వాత నాలుగు నెలలకు జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో 15 శాతానికి పడిపోయింది. 22 బీఆర్ఎస్ ఓట్లు ఎవరికి చేరాయి.? ఎవరెవరి మధ్యలో అవగాహన ఉంది.? ఎవరు ఎవరిని బలపరుస్తున్నారో అర్థం చేసుకోవాలి. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలోనూ ఇదే తతంగాన్ని కొనసాగించాలని ఈ రెండు పార్టీలు కుట్ర చేస్తున్నాయి. ఈ కుట్రలన్నింటినీ దృష్టిలో పెట్టుకుని తెలంగాణను అభివృద్ధి వైపు నడిపిద్దాం" అని సీఎం పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వివిధ రంగాల్లో విశేష సేవలందించిన వారికి ఇస్తున్న రాజీవ్ సద్భావనా అవార్డును కేంద్ర మాజీ మంత్రి సల్మాన్ ఖుర్షీద్‌కు బహూకరించారు. ఈ కా ర్యక్రమంలో మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సలహాదారులు షబ్బీర్ అలీ, హర్కర వేణుగోపాలరావు, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్, వీహెచ్ తదితరులు పాల్గొన్నారు. యాదవులు నమ్మకానికి మారుపేరు అని, మాట ఇస్తే కట్టుబడి ఉంటారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. నమ్మినవారి కోసం ఎంత కష్టమొచ్చినా, నష్టమొచ్చినా అండగా నిలుస్తారని తెలిపారు. యాదవుల సహకారంతోనే హైదరాబాద్ ప్రపంచ పెట్టుబడులకు ఆదర్శనగరంగా మారిందని, నగరంలో శాంతిభద్రతలను పరిరక్షిస్తున్నామని చెప్పారు.

బీసీ రిజర్వేషన్ల సాధనకు మిలియన్ మార్చ్

# తరహాలో ఉద్యమం

### కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కళ్లు తెరవాలి: ఎంపీ ఆర్.కృష్ణయ్య



**రాంనగర్, అక్టోబరు 19:** బీసీ రిజర్వేషన్ల సా?ధనకు మిలియన్ మార్చ్ తరహాలో భవిష్యత్తు పోరాటాలు చేపడతామని ఎంపీ ఆర్.కృష్ణయ్య స్పష్టం చేశారు. శనివారం జరిగిన రాష్ట్ర బంద్ విజయవంతమైందన్నారు. ఇకనైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కళ్లు తెరిచి.. వెంటనే 42 శాతం రిజర్వేషన్ అమలుకు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఆదివారం బీసీ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్‌లో రాష్ట్ర ప్రభుత్వం తెచ్చిన జీవో 9ను చేర్చాలని సూచించారు. బీసీ ఉద్యమాన్ని అణగదొక్కేందుకు ఉద్యమకారులపై సర్కారు అక్రమంగా కేసులు పెట్టిందని.. వాటిని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. రాజ్యాంగం ప్రకారం జనాభా ప్రాతిపదికన అన్ని వర్గాలకు రాజకీయ రిజర్వేషన్లు అమలు చేయాల్సిన బాధ్యత.. కే ంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఉందని చెప్పారు. ఎన్నికల షెడ్యూల్ విడుదలయ్యాక రిజర్వేషన్లపై కోర్టు స్టే ఇవ్వడం వెనక అగ్రవర్ణాల కుట్ర దాగి ఉందన్నారు. త్వరలోనే బీసీ సమావేశం నిర్వహించి భవిష్యత్తు కార్యాచరణ ప్రకటిస్తామని తెలిపారు.

# నక్సల్స్ ప్రభావిత జిల్లాల్లో ఇక వెలుగులు

### కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి



**న్యూఢిల్లీ, అక్టోబర్ 19:** దశాబ్దాలుగా చీకట్లో మగ్గిన నక్సల్స్ ప్రభావిత ప్రాంతాల్లో ఈ దీపావళి నుంచి వెలుగులు నిండబోతున్నాయని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. నక్సలైట్లు జనజీవన స్రవంతిలోకి రావడాన్ని స్వాగతిస్తున్నానని ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వచ్చే ఏడాది మార్చి నాటికి భారత్‌ను నక్సల్స్ రహిత దేశంగా తీర్చిదిద్దాలనే సంకల్పంతో ఆపరేషన్ కగార్ చేపట్టామని తెలిపారు. ఇటీవల కేవలం మూడు రోజుల్లోనే 300మందికి పైగా నక్సలైట్లు లొంగిపోయారని, అందులో తెలుగువారు ఎక్కువ ఉన్నారని పేర్కొన్నారు. ఇంతకాలం నక్సలిజం కారణంగా అనేక జిల్లాలు అభివృద్ధికి దూరంగా ఉన్నాయని, ఇప్పుడు ఆ పల్లెలు అభివృద్ధి వైపు వెళుతున్నాయని చెప్పారు. పదేళ్ల క్రితం దేశవ్యాప్తంగా 125 నక్సల్స్ ప్రభావిత జిల్లాలు ఉంటే ఇప్పుడు అవి 11కు తగ్గాయని, త్వరలోనే అవి కూడా నక్సల్స్ రహిత జిల్లాలుగా మారతాయని కిషన్‌రెడ్డి ఆశాభావం వ్యక్తంచేశారు. నక్స ల్స్ రహితంగా మారిన జిల్లాల్లో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలు, యువతకు ఉపాధి అవకాశాల కల్పనకు కట్టుబడి ఉన్నామని తెలిపారు.

కమీషన్లను కాదు..

# పాలనను పట్టించుకోండి

ఫ్యూచర్ లేని సిటీ కోసం

రేవంత్ అడ్డగోలు ఖర్చు: కేటీఆర్



**హైదరాబాద్, అక్టోబరు 19:** ప్రజా సమస్యలను చర్చించాల్సిన క్యాబినెట్ సమావేశంలో మంత్రులు కమీషన్ల కోసం కొట్లాడటం కాదు.. పాలనా వ్యవహారాలపై దృష్టిపెట్టాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సూచించారు. ఆదివారం తెలంగాణ భవన్‌లో జూబ్లీహిల్స్ పరిధిలోని పలువురు కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎసలో చేరారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ టెండర్ల నుంచి బిల్లుల విడుదల దాకా రాష్ట్ర ప్రజల సొమ్మును దోచుకుంటూ.. ప్రతి సందర్భంలోనూ కమీషన్ల కోసమే కాంగ్రెస్ మంత్రులు కొట్లాడుతున్నారన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి హైదరాబాద్‌తోపాటు రాష్ట్రాభివృద్ధి పూర్తిగా కుంటుబడటానికి వారి బాధ్యతారాహిత్య పరిపాలనే కారణమని చెప్పారు. ప్రజలున్న ప్రాంతాలను పక్కనపెట్టి భవిష్యత్తులేని ఫ్యూచర్ సిటీ కోసం అడ్డగోలుగా ఖర్చు పెట్టేందుకు సీఎం రేవంత్‌రెడ్డి ప్రయత్నిస్తున్నారన్నారు. కేవలం ఫ్యూచర్ సిటీలోని



- 'నో కింగ్స్' నిరసనలతో దద్దరిల్లిన అమెరికా
- దేశంలోని 50 రాష్ట్రాల్లో రోడ్డెక్కిన ప్రజానీకం
- ఆందోళనల్లో పాల్గొన్న 70 లక్షల మంది..!
- భారీ ర్యాలీలు, ప్లకార్డులతో ప్రదర్శనలు
- నిరసనకారులను హేళన చేస్తూ ఏఐ వీడియోలు పోస్టు చేసిన ట్రంప్

# ట్రంప్‌పై పెల్లుబికిన ప్రజాగ్రహం


**వాషింగ్టన్, అక్టోబరు 19:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌పై ప్రజాగ్రహం పెల్లుబికింది. ట్రంప్ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా ఆ దేశ ప్రజానీకం 'నో కింగ్స్' అంటూ ఆందోళన బాట పెట్టింది. నో కింగ్స్ పేరిట దేశవ్యాప్తంగా శనివారం నిర్వహించిన నిరసనల్లో లక్షలాది ప్రజలు ట్రంప్‌కు వ్యతిరేకంగా రోడ్డెక్కి తమ నిరసనను తెలియజేశారు. వలసల నియంత్రణకు ట్రంప్ తీసుకుంటున్న చర్యలు, విశ్వవిద్యాలయాలకు నిధుల తగ్గింపు, దేశంలోని చాలా రాష్ట్రాల్లో సైనికుల మోహరింపు, షట్‌డౌన్‌తో ప్రభుత్వ సేవలు నిలిచిపోవడం వంటి అనేక కారణాలు ఈ నిరసనల వెనుక ఉన్నాయి. ట్రంప్ దేశ అధ్యక్షుడిగా రెండో సారి బాధ్యతలు చేపట్టిన తర్వాత ప్రభుత్వానికి వ్యతిరేకంగా జరిగిన మూడో ఆందోళన ఇది. మీడియా కథనాల ప్రకారం అమెరికాలోని 50 రాష్ట్రాల్లోని 2,700 ప్రాంతాల్లో నోకింగ్స్ నిరసన ప్రదర్శనలు జరిగాయి. దాదాపు 70 లక్షల మంది ప్రజలు ఈ నిరసనల్లో పాల్గొన్నారని అంచనా. న్యూయార్క్, వాషింగ్టన్, బోస్టన్, కాలిఫోర్నియా, షికాగో వంటి ప్రధాన నగరాలతోపాటు చిన్నచిన్న పట్టణాలు, కమ్యూనిటీల్లో కూడా ప్రజలు నిరసన ప్రదర్శనలు చేశారు. బ్యాండు మేళాలు, విచిత్ర వేషధారణలతో నిరసనల్లో పాల్గొన్న ప్రజలు నిరంకుశత్వానికి, ఇమ్మిగ్రేషన్ విధానాలకు వ్యతిరేకంగా ప్లకార్డులు ప్రదర్శించారు. న్యూయార్క్ టైమ్ స్క్వేర్, బోస్టన్, కాలిఫోర్నియా, షికాగోల్లో జరిగిన నిరసన ప్రదర్శనల్లో వేల సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు. ప్రజాస్వామ్యం అంటే ఇలా ఉంటుంది. భయం లేదు, ద్వేషం లేదు. వలసదారులకు స్వాగతం అంటూ నినాదాలు చేశారు. లాస్‌ఏంజెలెసలో జరిగిన నిరసనల్లో ఆందోళనకారులు వలసదారుల హక్కులకు ప్రాధాన్యం ఇచ్చారు. మెక్సికో, అమెరికా జెండాలను ప్రదర్శించారు. కెనడా, బెర్లిన్, రోమ్, పారిస్, స్వీడన్‌లోని అమెరికా రాయబార కార్యాలయాల బయట కూడా నిరసనలు జరిగాయి. దేశవ్యాప్తంగా 2500కు పైగా నిరసన ప్రదర్శనలు జరిగాయని, శాంతియుతంగా జరిగిన ఈ ర్యాలీల్లో ఎవర్ని అరెస్టు చేయలేదని పోలీసులు ప్రకటించారు.

పప్పు దినుసుల

# సాగు విస్తీర్ణం పెరగాలి

అధిక దిగుబడినిచ్చే వంగడాలపై రైతులకు అవగాహన కల్పించాలి

రాష్ట్ర వ్యవసాయ మంత్రి తుమ్మల



**హైదరాబాద్, అక్టోబరు 19:** నూనె గింజలతోపాటు పప్పు ధాన్యాల సాగు విస్తీర్ణాన్ని గణనీయంగా పెంచాల్సి ఉందని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఈ నెల 21న జరిగే 'రైతు నేస్తం' కార్యక్రమంలో పప్పు దినుసుల్లో అధిక దిగుబడినిచ్చే వంగడాలపై అన్నదాతలకు అవగాహన కల్పించాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఈ ఏడాది యాసంగిలో రూ.2.68 కోట్ల సబ్సిడీతో 14 జిల్లాల్లో 19,397 ఎకరాలకు సరిపడా 5825 క్వింటాళ్ల వేరుశనగ విత్తనాల పంపిణీకి వ్యవసాయశాఖ ఏర్పాట్లు చేసిందని చెప్పారు. 84 క్వింటాళ్ల పొద్దు తిరుగుడు, 74 క్వింటా ళ్ల కుసుమలతోపాటు శనగ విత్తనాలు పంపిణీ చేస్తున్నామని, ఇందుకు రూ.45.41 లక్షలు వెచ్చిస్తున్నట్లు తెలిపారు. రూ.48.54 కోట్లతో 2025-26 సంవత్సరంలో జాతీయ ఆహార భద్రత పథకం అమలు చేస్తున్నట్లు తెలిపారు. విత్తనాలతోపాటు ప్రదర్శనా క్షేత్రాలు, విత్తనోత్పత్తి కార్యక్రమాలను చేపడుతున్నామని ఆయ న పేర్కొన్నారు. రైతులకిచ్చిన హామీ మేరకు జాతీ య నూనె గింజల మిషన్, వ్యవసాయ యాంత్రీకరణ పథకాలను చేపడుతున్నామన్న మంత్రి తుమ్మల.. ఇప్పటికే యాంత్రీకరణ లబ్ధిదా రులను ఎంపిక చేశామని వెల్లడించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వాటాధనంతో అమల్యే పథకాలు ఒక్కొక్కటి పునరుద్ధరిస్తున్నట్లు తెలిపారు.

దీపాలు, కొవ్వొత్తులపై

# ఖర్చు ఎందుకు?

### క్రిస్మస్ నుంచి నేర్చుకోవాలి: అఖిలేశ్ యాదవ్

**న్యూఢిల్లీ, అక్టోబరు 19:** సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్ దీపావళి ఉత్సవాల సందర్భంగా దీపాలు, కొవ్వొత్తులపై చేసే ఖర్చుతోపాటు క్రిస్మస్ వేడుకల నుంచి నేర్చుకోవాలంటూ చేసిన వ్యాఖ్యలు దుమారం రేపుతున్నాయి. యూపీ ప్రభుత్వం దీపావళి సందర్భంగా చేసే ఖర్చును ప్రస్తావిస్తూ శనివారం అఖిలేష్ మాట్లాడారు. 'నేను రాముడి పేరు మీద ఒక సలహా ఇస్తాను. క్రిస్మస్ సందర్భంగా ప్రపంచ వ్యాప్తంగా అన్ని నగరాలు వెలిగిపోతుంటాయి. నెలల తరబడి పండగ లైటింగ్స్ ఉంటాయి. వారి నుంచి మనం నేర్చుకోవాలి.

# మల్లోజుల, ఆశన్న విప్లవ ద్రోహులు

### వారిని ప్రజలే శిక్షిస్తారు.. ఇద్దరినీ పార్టీ నుంచి బహిష్కరిస్తున్నాం

### మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ ప్రకటన



**హైదరాబాద్, చర్ల, చింతూరు, అక్టోబరు 19:** ఆయుధాలతో సహా లొంగిపోయిన మావోయిస్టు అగ్రనేతలు మల్లోజుల వేణుగోపాల్, ఆశన్నలకు ప్రజలే శిక్ష విధిస్తారని మావోయిస్టు పార్టీ పేర్కొంది. వారి లొంగుబాటు విప్లవ ద్రోహమని మండిపడింది. వారితోపాటు లొంగిపోయినవారందరినీ మావోయిస్టు పార్టీ నుంచి బహిష్కరిస్తున్నట్లు వెల్లడించింది. ఈ మేరకు.. మావోయిస్టు పార్టీ కేంద్ర అధికార ప్రతినిధి అభయ్ పేరిట నాలుగు పేజీల లేఖ విడుదల చేసింది. మల్లోజుల భార్య గతంలో మహారాష్ట్ర ప్రభుత్వం ఎదుట లొంగిపోయిందని.. అప్పటి నుంచే ఆ రాష్ట్ర సీఎం ఫడణవీస్‌తో ఆయనకు సంబంధాలు ఏర్పడినట్లు అనుమానిస్తున్నామని ఆ లేఖలో అభయ్ పేర్కొన్నారు. ఆయన కోవర్టు చర్యకు పాల్పడినట్లు ఆరోపించారు. 2011 చివరి నుంచి గడ్డు స్థితిని ఎదుర్కొంటూ వచ్చిన దండకారణ్య విప్లవోద్యమం 2018 నాటికి తాత్కాలిక వెనకంజకు గురైందని, అప్పటి నుంచే మల్లోజులలో రాజకీయ బలహీనతలు బయటపడుతూ వచ్చాయని తెలిపారు. 2020లో జరిగిన కేంద్ర కమిటీ సమావేశంలో దండకారణ్య విప్లవాచరణలోని కొన్ని లోపాలపై ఆయన స్వీయ విశ్లేషణ చేస్తూ ఒక పత్రాన్ని ప్రవేశపెట్టారని, దాన్ని కేంద్ర కమిటీ తిరస్కరించిందని వివరించారు.

# బ్యాంకులు భళా..




**న్యూఢిల్లీ,**
బ్యాంకులు భళా అనిపించాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికపు ఆర్థిక ఫలితాల్లో అంచనాలకుమించి రాణించాయి. ప్రభుత్వరంగ బ్యాంకులతోపాటు ప్రైవేట్ బ్యాంకులు కూడా రెండంకెల వరకు వృద్ధిని సాధించాయి. దీంట్లోభాగంగా ఎల్ఐసీ ఆధ్వర్యంలో నడుస్తున్న ఐడీబీఐ బ్యాంక్ అయితే ఏకంగా రెండు రెట్లు లాభాన్ని గడించింది. జూలై-సెప్టెంబర్ మధ్యకాలానికిగాను బ్యాంక్ రూ.3,627 కోట్ల నికర లాభాన్ని ఆర్జించినట్టు శనివారం ప్రకటించింది. కిందటి ఏడాది ఇదే త్రైమాసికంలో నమోదైన రూ.1,836 కోట్లతో పోలిస్తే ఇంచుమించు రెండు రెట్లు అధికమయ్యాయి. నేషనల్ సెక్యూరిటీస్ డిపాజిటరీ లిమిటెడ్‌కు 11.11 శాతానికి సమానమైన 2.22 కోట్ల ఈక్విటీ షేర్లను కేటాయించడంతో రూ.1,698.96 కోట్ల నిధులు సమకూరడం వల్లనే లాభాలు భారీగా పెరిగాయని తెలిపింది. బ్యాంక్ వ్యాపారం 12 శాతం వృద్ధితో రూ.5,33,730 కోట్లకు చేరుకున్నది. ఏడాది క్రితం 3.68 శాతంగా ఉన్న బ్యాంక్ స్థూల నిరర్థక ఆస్తుల విలువ గత త్రైమాసికంలో 2.65 శాతానికి తగ్గగా, నికర ఎన్‌పీఏ స్వల్పంగా పెరిగి 0.21 శాతానికి చేరుకున్నది. 2025-26 ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికానికిగాను రూ.4,904 కోట్ల నికర లాభాన్ని గడించింది పంజాబ్ నేషనల్ బ్యాంక్. కిందటి ఏడాది ఇదే కాలానికి ఆర్జించిన రూ.4,303 కోట్ల లాభంతో పోలిస్తే 14 శాతం వృద్ధిని కనబరిచినట్లు బ్యాంక్ పేర్కొంది. సమీక్షకాలంలో బ్యాంక్ ఆదాయం 5.1 శాతం వృద్ధితో రూ.36.214 కోట్లకు చేరుకున్నట్లు ఒక ప్రకటనలో వెల్లడించింది. బ్యాంక్ స్థూల నిరర్థక ఆస్తుల విలువ 4.48 శాతం నుంచి 3.45 శాతానికి దిగిరాగా, నికర ఎన్‌పీఏ 0.46 శాతం నుంచి 0.36 శాతానికి దిగొచ్చాయి.

# భారీగా తగ్గిన బంగారం అమ్మకాలు

## కానీ, 40 శాతం పెరిగిన వెండి విక్రయాలు



**ముంబై/న్యూఢిల్లీ,**
ధంతేరాస్‌కు ధరల సెగ గట్టిగానే తాకింది. ఆకాశమే హద్దుగా దూసుకు పోయిన ధరల కారణంగా బంగారం విక్రయాలు భారీగా పడిపోయినప్పటికీ వెండి అమ్మకాలు మాత్రం పెరిగాయి. ఈసారి ధంతేరాస్‌న ఆభరణాల అమ్మకాలు 15 శాతం వరకు పడిపోయినట్టు గణాంకాలు చెబుతున్నాయి. బంగారం రికార్డు స్థాయి ధరల కారణంగా కొనుగోలుదారులు తక్కువ ధర కలిగిన వెండికి మొగ్గుచూపారు. దీంతో వెండి నాణేల అమ్మకాలు 35 శాతం నుంచి 40 శాతం వరకు పెరిగినట్టు తెలుస్తున్నది. ధంతేరాస్ కారణంగా శనివారం మధ్యరాత్రి వరకు, అలాగే ఆదివారం కూడా ఆభరణాల స్టోర్లు తెరిచివుంచనున్నారు. గడిచిన ఏడాదికాలంలో పదిగ్రాముల బంగారం ధర రూ.63 శాతం ఎగబాకి రూ.1.32 లక్షలకు చేరుకున్నది. ఏడాదిక్రితం ధంతేరాస్ రోజున గోల్డ్ ధర రూ.81,400గా ఉన్నది. అలాగే వెండి ధరలు 40 శాతం మేర అధికమయ్యాయి. అధిక ధరల కారణంగా కొనుగోలుదారులు 1-50 గ్రాముల బరువు కలిగిన నాణేలకు మొగ్గుచూపారు. ఈ సందర్భంగా ఆల్ ఇండియా జెమ్ అండ్ జ్యూవెల్లరీ డొమెస్టిక్ కౌన్సిల్(జీజేసీ) చైర్మన్ రాజేశ్ రోక్డే మాట్లాడుతూ..ఈ ఏడాది ధంతేరాస్ రోజున బంగారం అమ్మకాలు 10-15 శాతం వరకు తగ్గే అవకాశాలున్నప్పటికీ మొత్తం పండుగ బిజినెస్ మాత్రం రూ.50 వేల కోట్లను అధిగమించవచ్చన్నారు. మెట్రో నగరాలతో పోలిస్తే ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాల్లో వెండి నాణేల సేల్స్ 35-40 శాతం వరకు పెరిగాయన్నారు. అమ్మకాలు పడిపోయినప్పటికీ విలువ పరంగా చూస్తే మాత్రం 20-25 శాతం వరకు పెరిగాయి.

**టాప్‌గేర్‌లో వాహన అమ్మకాలు**

వాహన అమ్మకాలు టాప్‌గేర్‌లో దూసుకుపోయాయి. ధంతేరాస్ కావడంతో అమ్మకాలు భారీగా పెరిగాయి. మారుతి సుజుకీ ఏకంగా 50 వేల యూనిట్లను ఒకేరోజు విక్రయించినట్టు తెలుస్తున్నది. 41 వేల కార్లను ఈరోజు డెలివరీ చేసినట్టు కంపెనీ సీనియర్ ఉన్నతాధికారి పార్థో బెనర్జీ ఒకరు తెలిపారు. కంపెనీ చరిత్రలో ఒకేరోజు ఇన్ని వాహనాలు డెలివరీ చేయడం ఇదే తొలిసారని ఆయన వ్యాఖ్యానించారు. ఇక విక్రయాలు 20 శాతం పెరిగాయని హ్యుం దాయ్ ప్రకటించింది. జీఎస్టీ తగ్గింపుతో వాహన ధరలు భారీగా తగ్గడంతో కొనుగోళ్లు భారీగా పెరిగాయి. వాహనాలతోపాటు టీవీలు కూడా అత్యధికంగా అమ్ముడయ్యాయి. 55 ఇంచులు, అంతకంటే పెద్దవి కలిగిన టీవీలు ఈ నెల 1 నుంచి 17 వరకు 36 శాతం పెరిగాయని ఇండస్ట్రీ వర్గాలు వెల్లడించాయి. ఆన్‌లైన్‌లో బంగారు, వజ్రాభరణాలనూ భారతీయులు కొనేస్తున్నారు.

# శాంతించిన బంగారం

## - రూ.2,400 తగ్గిన తులం ధర - రూ.1,32,400కి దిగొచ్చిన విలువ




**న్యూఢిల్లీ,**
ఆకాశమే హద్దుగా దూసుకుపోయిన బంగారం ధరలు ఎట్టకేలకు శాంతించాయి. దేశ రాజధాని న్యూఢిల్లీ బులియన్ మార్కెట్లో పదిగ్రాముల బంగారం ధర రూ.2,400 తగ్గి రూ.1,32,400కి తగ్గింది. అంతకుముందు ఇది రూ.1,34,800గా ఉన్నది. ధంతేరస్ కావడంతో ఆభరణాల దుఖాణాల్లో కొనుగోళుదారుల సందడి నెలకొన్నప్పటికీ ధరలు తగ్గడం విశేషం. అంతర్జాతీయ మార్కెట్లో అతి విలువైన లోహాల ధరలు భారీగా తగ్గడం వల్లనే దేశీయంగా ధరలు దిగొచ్చాయని ఆల్ ఇండియా సరఫా అసోసియేషన్ వెల్లడించింది. అలాగే 99.5 శాతం స్వచ్ఛత కలిగిన పుత్తడి ధర అంతే స్థాయిలో తగ్గి రూ.1,31,800గా నమోదైంది.

గతేడాది ధంతేరస్ నుంచి ఈసారి ధంతేరస్ వరకు 24 క్యారెట్ బంగారం ధర రూ.51 వేలు లేదా 62.65 శాతం పెరిగింది. ఏడాది క్రితం రూ.81,400గా ఉన్న పదిగ్రాముల ధర ప్రస్తుతం రూ.1.31 లక్షల స్థాయికి ఎగబాకింది. రికార్డు స్థాయిలో దూసుకుపోయిన వెండి కూడా భారీగా తగ్గింది. అధిక ధరల కారణంగా కొనుగోళ్లు పూర్తిగా నిలిచిపోవడంతో వెండి ఏకంగా రూ.7 వేలు దిగొచ్చింది. శుక్రవారం రూ.1.77 లక్షలుగా ఉన్న కిలో వెండి ప్రస్తుతం రూ.1.70 లక్షలకు దిగొచ్చింది. మరోవైపు, గడిచిన ఏడాదికాలంలో కిలో వెండి రూ.70,300 లేదా 70.51 శాతం ఎగబాకింది. కిందటి ఏడాది ధంతేరస్ రోజున రూ.99,700గా ఉన్నది.

# రిలయన్స్‌కు ఇన్వెంటరీ సెగ

## క్యూ2లో రూ.18,165 కోట్లకు పరిమితమైన లాభం


**న్యూఢిల్లీ,** చమురు నుంచి టెలికాం వరకు సేవలు అందిస్తున్న రిలయన్స్ ఇండస్ట్రీస్ నిరాశా జనక ఆర్థిక ఫలితాలను ప్రకటించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికానికిగాను రూ.18,165 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభాన్ని గడించింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో నమోదైన రూ.16,653 కోట్ల లాభంతో పోలిస్తే 9.6 శాతం వృద్ధిని కనబరుచగా, తొలి త్రైమాసికంలో వచ్చిన రూ.26,994 కోట్ల లాభంతో పోలిస్తే 33 శాతం తగ్గింది. ఇన్వెంటరీ నష్టాలు రెండింతలు కావడం వల్లనే మొత్తం లాభాలపై ప్రతికూల ప్రభావం చూపిందని పేర్కొంది. సమీక్షకాలంలో కంపెనీ ఆదాయం రూ.2.35 లక్షల కోట్ల నుంచి రూ.2.59 లక్షల కోట్లకు ఎగబాకింది.




అతిపెద్ద టెలికాం సంస్థ జియో ఆశాజనక ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. జూలై-సెప్టెంబర్ మధ్యకాలానికిగాను సంస్థ రూ.7,379 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభాన్ని గడించింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో నమోదైన లాభంతో పోలిస్తే 12.8 శాతం వృద్ధిని కనబరిచింది. సరాసరిగా ఒక్కో యూజర్‌పై వచ్చే ఆదాయం పెరగడంతోపాటు ఫిక్స్‌డ్ వైర్‌లెస్ సర్వీసులు విస్తరించడం కూడా కలిసొచ్చింది. సమీక్షకాలంలో కంపెనీ ఆదాయం ఏడాది ప్రాతిపదికన 14.6 శాతం ఎగబాకి రూ.36,332 కోట్లకు చేరుకున్నది. సరాసరిగా ఒక్కో కస్టమర్‌పై వచ్చే ఆదాయం రూ.195.1 నుంచి రూ.211.4కి చేరుకున్నది.

# ఈ సారి భిన్నంగా మూరత్ ట్రేడింగ్..!

## దీపావళి స్పెషల్ ట్రేడింగ్ సమయం ఇదే..!




సాధారణంగా దీపావళి రోజున జరిగే స్టాక్ మార్కెట్ మూరత్ ట్రేడింగ్ సెషన్ ఈ ఏడాది మధ్యాహ్నం జరుగనున్నది. ఈ మేరకు నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్, బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ సర్క్యులర్ జారీ చేశాయి. సర్క్యులర్ ప్రకారం.. ప్రతి సంవత్సరం మూరత్ ట్రేడింగ్ సాయంత్రం జరిగేది. కానీ, ఈ సారి మాత్రం దీపావళి మూరత్ ట్రేడింగ్ ఈ నెల 21న మధ్యాహ్నం 1.45 గంటల నుంచి 2.45 గంటల వరకు జరుగుతుందని సర్క్యులర్‌లో ఎన్‌ఎస్‌ఈ పేర్కొంది. శని, ఆదివారాల్లో మార్కెట్లు మూతపడగా.. సోమవారం ట్రేడింగ్ యథావిధిగా కొనసాగుతుంది. ఇక ఈ నెల 21, 22 తేదీల్లో స్టాక్ మార్కెట్లకు సెలవు ఉంటుందని బీఎస్‌ఈ, ఎన్‌ఎస్‌ఈ వర్గాలు పేర్కొన్నారు. లక్ష్మీపూజ సందర్భంగా 21న గంట పాటు ప్రత్యేకంగా ట్రేడింగ్ సెషన్ కొనసాగుతుందని.. ఇన్వెస్టర్లు, ట్రేడర్లు ఈ సెషన్‌ను ప్రవితంగా భావిస్తారు. అయితే, గతంలో కంటే ఈ సారి భిన్నంగా మధ్యాహ్నం సమయంలో ట్రేడింగ్ జరుగుతున్నది. గత సంవత్సరం 2024 పండుగ సీజన్‌లో రెండు సూచీలు లాభాలను నమోదు చేశాయి. బీఎస్‌ఈ సెన్సెక్స్ 335 పాయింట్లు పెరిగి 79,724 పాయింట్ల వద్దకు చేరుకోగా.. నిఫ్టీ 50.99 పాయింట్లు పెరిగి 24,304 పాయింట్ల వద్ద ముగిసింది. ఇదిలా ఉండగా.. హిందూ క్యాలెండర్ ప్రకారం కొత్త ఆర్థిక సంవత్సరం 2025-28కి స్వాగతం పలుకుతూ ఈ మూరత్ ట్రేడింగ్ నిర్వహిస్తారు. ఈ ట్రేడింగ్ లాభనష్టాలకు అతీతం గా ఉంటుంది. రాబోయే ఏడాదిలో సంపద, శ్రేయస్సును ఆకాంక్షిస్తూ శుభారంభంగా ట్రేడర్లు ట్రేడింగ్ భావిస్తారు. బ్రోకర్లు, కుటుంబీకులు, ఇన్వెస్టర్లు ఉత్సాహంగా పాల్గొని షేర్లను కొనుగోలు చేసి కొత్త ఖాతాలను తెరుస్తారు. ఈ సెషన్‌లో ట్రేడింగ్ వాల్యూమ్ తక్కువగా ఉన్నప్ప టికీ.. సెంటిమెంట్ బలంగా ఉండడంతో మార్కెట్లు సానుకూలంగా ఉంటాయి. గత 13 సంవత్స రాలుగా మూరత్ సమయంలో సూచీలు లాభాల్లో కొనసాగడం విశేషం.

# తోషిబా హైదరాబాద్ ప్లాంట్ విస్తరణ

## జపాన్, ఇండియా ప్లాంట్ల సామర్థ్యం రెట్టింపు




**హైదరాబాద్,**
జపాన్‌కు చెందిన ఎలక్ట్రానిక్ పరికరాల దిగ్గజం తోషిబా భారీ పెట్టుబడులు పెట్టబోతున్నట్టు ప్రకటించింది. వచ్చే ఆర్థిక సంవత్సరంలో జపాన్‌తోపాటు భారత్‌లో ఉన్న ప్లాంట్ల సామర్థ్యాన్ని రెట్టింపు పెంచుకోవడానికి 55 బిలియన్ల యెన్(రూ.3,232 కోట్లు) పెట్టుబడి పెట్టను న్నట్టు ప్రకటించింది. ఈ భారీ పెట్టుబ డులను తోహిబా ఎనర్జీ సిస్టమ్స్ అండ్ సొల్యూషన్స్ కార్పొరేషన్(తోషిబా) ప్రకటిం చింది. దేశవ్యాప్తంగా హైదరా బాద్‌లో మాత్రమే సంస్థకు ప్లాంట్ ఉన్నది. ఈ నిధులతో పవర్ ట్రాన్స్‌మిషన్ అండ్ డిస్ట్రిబ్యూషన్(టీఅండ్‌డీ) పరికరాల బిజినెస్‌ను మరింత విస్తరించనున్నది. అంతర్జాతీయంగా విద్యుత్ విభాగంలో ఉన్న అవకాశాలను అందిపుచ్చుకోవడానికి ఈ భారీ పెట్టుబడులు పెడుతున్నట్టు కంపెనీ వర్గాలు ప్రకటించాయి. దీంతో 2029-30 ఆర్థిక సంవత్సరం నాటికి జపాన్‌తోపాటు భారత్‌లో ఉన్న ప్లాంట్ల సామర్థ్యం రెండిం తలు పెంచుకోనున్నది. జూలై 2024 నుంచి 2026 మధ్యకాలంలో 20 బిలియన్ల యెన్‌లు పెట్టుబడులు పెట్టను న్నట్టు గతంలో సంస్థ ప్రకటించగా..దీనికి అదనంగా మరో 35 బిలియన్ల యెన్‌లు కూడా ఇన్వెస్ట్ చేయనున్నట్లు ప్రకటించింది. రెన్యూవబుల్ ఎనర్జీ, నూతన డాటా సెంటర్ల నిర్మాణాలు వేగంగా జరుగుతుండటంతో భారత్‌లో విద్యుత్‌కు డిమాండ్ భారీగా పెరుగుతున్నదన్నారు.

# మరిన్ని హంగులతో జియో ఫీచర్ ఫోన్




**హైదరాబాద్,**
దేశీయ మార్కెట్లోకి అదనపు ఫీచర్లతో జియో మరో ఫీచర్ ఫోన్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. ప్రత్యేకంగా చిన్న పిల్లలు, మహిళలు, వృద్ధుల భద్రతను దృష్టిలో పెట్టుకొని రూపొందించిన ఈ కొత్త సేఫ్టీ ఫీచర్ కస్టమర్లను విశేషంగా ఆకట్టుకుంటున్నది. పెరిగిపోతున్న ఆన్‌లైన్ మోసాలు, స్కామ్‌ల నేపథ్యంలో కుటుం బాల భద్రతపై ఆందోళన చెందుతు న్నారు. ఈ సవాళ్లను ఎదుర్కోవడానికి జియోభారత్ 'సేఫ్టీ-ఫస్ట్' ఫోన్‌లో రియల్‌టైమ్ లోకేషన్ ట్రాకింగ్, వినియోగ నిర్వహణ, ఫోన్ హెల్త్ మానిటరింగ్ వంటి ఫీచర్‌లను అంది స్తున్నది. ఈ ఫోన్‌ను కేవలం రూ.799కే అందిస్తున్నది. దీపావళి పండుగను దృష్టిలో పెట్టుకొని రూ.100 చెల్లించి బుకింగ్ చేసుకునే వీలు కల్పించింది.

# ఘనంగా కల్లుగీత కార్మిక సంఘం 68వ వార్షికోత్సవాలు

**కవులు, రచయితలు, కళాకారుతో ఆత్మీయ సమ్మేళనం**

**మారుతున్న కాలానికనుగుణంగా వృత్తిలో మార్పులు తేవాలి - కెజికెస్ రాష్ట్ర అధ్యక్షులు ఎంవి రమణ**

**రాజకీయ,ఆర్థిక, సామాజిక రంగాలలో రాణించాలి -రాష్ట్ర కెజికెస్ వార్షికోత్సవ సభలో గోపా డివిజన్ అధ్యక్షులు సమ్మి గౌడ్ చిలువేరు**







**కేసముద్రం, అక్టోబర్ 19 :**
కల్లుగీత కార్మిక సంఘం 68వ వార్షికోత్సవాలు ఈరోజు సుందరయ్య విజ్ఞాన కేంద్రంలోని ఐలమ్మ ఆర్ట్ గ్యాలరీలో ఘనంగా నిర్వహించడం జరిగింది. రాష్ట్రంలోని ప్రముఖ కవులు, రచయితలు, కళాకారులు 50 మంది పాల్గొని కళాకారులు పాల్గొని కల్లుగీత వృత్తి లో పడుతున్న ఇబ్బందులు,తాటి ఈత చెట్ల ఔన్నత్యాన్ని తెలియజేస్తూ పాటలు, కవితలు వినిపించారు. మేకపోతుల వెంకటరమణ అధ్యక్షతన సభ జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజంలో రోజురోజుకు అనేక మార్పులు జరుగుతున్నాయని కల్లుగీత వృత్తిలో కూడా ఆధునీకరణ తీసుకురావాలని అందుకు ప్రభుత్వాలు పూనుకోవాలన్నారు. రాష్ట్రంలో కోటి తాటి ఈత చెట్ల సంపద ఉన్నదని ఐదు లక్షల కుటుంబాలు ఆధారపడి జీవిస్తున్నాయన్నారు. ప్రకృతి పానీయం కల్లు, నీరా ఆరోగ్యానికి ఎంతో మంచిదని, తాటి ఈత చెట్ల ద్వారా అనేక ఉత్పత్తులు తయారు చేయవచ్చని అన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వీరి అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక రూపొందించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెల్లంకొండ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ నాటి నుండి నేటి వరకు అనేక హక్కులు సంఘం ద్వారా సాధించుకున్నామన్నారు. సొసైటీలు, గీచే వానికే చెట్టు పథకం, పెన్షన్, ఎక్స్‌గ్రేషియా, చెట్ల పెంపకానికి భూమి, నీరా కేఫ్, ప్రమాద నివారణకు సేఫ్టీ కిట్టు లాంటి కొన్ని సమస్యలు సాధించుకున్నామన్నారు. తెలంగాణ ప్రజా సంస్కృతిక కేంద్రం అధ్యక్షులు భూపతి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి ఎంతో గొప్పదని అన్నారు. కల్లుగీత కార్మికుల కష్టాలను పరిష్కార మార్గాలను పాటలు, కవిత్వం, రచనల ద్వారా సమాజానికి తెలియజేయాలని కళాకారులకు విజ్ఞప్తి చేశారు. కల్లుగీత వృత్తిలో ప్రమాదాలు జరిగిన వారికి ఉచిత వైద్య సేవలు అందిస్తున్న సుప్రజ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ శిగ విజయ్ కుమార్ గౌడ్ గారికి, వృత్తిలో మరణించిన కుటుంబాలకు ఆర్థిక సహాయం మరియు పిల్లల చదువుల కోసం ఆర్థిక సహాయం అందిస్తున్న కన సంస్థకు అభినందనలు తెలియజేసి వారి ప్రతినిధి నాతి గణేష్ గౌడ్ గారిని ప్రముఖ పాటల రచయిత సింగర్ మానుకోట ప్రసాద్ గౌడ్ గారి ని గోపా మహబూబాబాద్ డివిజన్ అధ్యక్షులు చిలువేరు సమ్మి గౌడ్ ఘనంగా సన్మానించారు ఈ కార్యక్రమంలో గౌడ కల్లుగీత సంఘాల సమన్వయ కమిటీ రాష్ట్ర చైర్మన్ బాలగోని బాలరాజ్ గౌడ్, రాష్ట్ర కన్వీనర్ ఐలి వెంకన్న గౌడ్, ఎలికట్టె విజయ్ కుమార్ గౌడ్, అంబాల నారాయణ గౌడ్, వంగ సదానందం గౌడ్,వివిధ కుల సంఘాల రాష్ట నాయకులు, కెజికెస్ రాష్ట్ర కమిటీ నాయకులు, సోషల్ మీడియా వారియర్స్ తదితరులు పాల్గొని అభినందనలు తెలిపారు.

# విశ్వ మానవాళిలో మహోన్నతమైన సిద్ధాంతం కమ్యూనిజం

**సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు తమ్మినేని వీరభద్రం**




**రామన్నపేట, అక్టోబర్ 19 :**
దేశంలో పెట్టుబడిదారీ విధానం వలన ప్రజల్లో అసమానతలు పెరుగుతున్నాయని, ప్రజలకు కనీస అవసరాలు కల్పించాలని పాలక విధానాలకు వ్యతిరేకంగా యువత ఉద్యమించాలని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు తమ్మినేని వీరభద్రం పిలుపునిచ్చారు. సిపిఎం ఆధ్వర్యంలో స్థానిక మండల కేంద్రంలో యువ కమ్యూనిస్టుల సమ్మేళనం నిర్వహించారు. సమ్మేళనం ప్రారంభానికి ముందు రామన్నపేటలో యువత భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. అమరవీరులకు నివాళులర్పించారు. ముఖ్యఅతిథిగా హాజరైన తమ్మినేని వీరభద్రం ప్రారంభ సూచికంగా పతాకాన్ని ఆవిష్కరించి అనంతరం జరిగిన సభలో మాట్లాడుతూ కమ్యూనిస్టులు పురోగమిశక్తులుగా అవతరిస్తున్నారని శ్రీలంక వంటి పరిణామాలే నిదర్శనం అని అన్నారు. ప్రజలకు విద్య వైద్యం కనీస అవసరాలు తీర్చలేని స్థితిలో ప్రభుత్వాలు ఉన్నాయని ఎన్నికల్లో గెలవడం కోసం అమలు కానీ ఆచరణ లేని హామీలిచ్చి గెలిచాక ప్రజల్ని ఆర్థిక సంక్షోభంలోకి నెట్టేసి ప్రజా వ్యవస్థను చిన్నబిన్నం చేస్తున్నాయని తెలిపారు. నాటునుండి నేటి వరకు ప్రజల కోసం ప్రాణాలను తృణప్రాయం చేసి పోరాటం జరుగుతున్నది కమ్యూనిస్టులే అని బిజెపికి ప్రజా సమస్యలపై పోరాడిన చరిత్ర లేదని స్వాతంత్ర దిమానికి ద్రోహం చేసి నేడు మేము దేశభక్తులు అని అబద్ధ ప్రచారం చేస్తున్న ఆర్ఎస్ఎస్ ను యువత తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. సమాజంలో జరుగుతున్న అంతరాలు అసమానతలపై యువ కమ్యూనిస్టులు సంఘటితంగా పోరాడాలని అన్నారు.

**యువత ప్రశ్నించకుండా సమాజం ముందుకెళ్లదు : ఎండి జహంగీర్**

దోపిడి వ్యవస్థ పై యువత ప్రశ్నించకుండా పోరాడకుండా ఉంటే సమాజం తీరోగములలో ఉంటుందని అలాంటి వ్యవస్థను కూల్చేందుకు యువత ముందుకు రావాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎండి జహంగీర్ పిలుపునిచ్చారు. మనువాదం మతోన్మాదం పేరుతో బిజెపి ప్రజల్లో విద్వేషాలు రెచ్చగొట్టి విభజన రాజకీయాలు చేస్తుందని అది సామాజిక న్యాయానికి సమానత్వానికి వ్యతిరేకం అని అన్నారు. రిజర్వేషన్ల అంశంలో అది తేలిపోయిందని స్పష్టం చేశారు. యువత మతఉన్మాదానికి మారకద్రవ్యాలకు దూరంగా ఉంటూ విశ్వమానవాళిలో ఉన్నతమైన సిద్ధాంతం మార్క్సిజన్ అవగాహన చేసుకోవాలని రాబోయే స్థానిక సంస్థలు ఎన్నికల్లో కమ్యూనిస్టులను గెలిపించేందుకు, గ్రామాలు అభివృద్ధి చెందేందుకు పాటుపడాలని పిలుపునిచ్చారు. సిపిఎం మండల కార్యదర్శి బొడ్డుపల్లి వెంకటేశం అధ్యక్షతన జరిగిన ఈ సమ్మేళనంలో సిపిఎం జిల్లా సీనియర్ నాయకులు మేక అశోక్ రెడ్డి, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జల్లెల పెంటయ్య, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గడ్డం వెంకటేశం, జిల్లా కమిటీ సభ్యులు బలుగూరి అంజయ్య, వనం ఉపేందర్, మండల కార్యదర్శి వర్గ సభ్యులు కూరెళ్ళ నరసింహ చారి, బోయిని ఆనంద్, కందుల హనుమంతు, కల్లూరి నాగేష్, మండల కమిటీ సభ్యులు గొరిగి సోములు, నాగటి ఉపేందర్, గన్నెబోయిన విజయభాస్కర్, మీర్ కాజా అలీ, భావండ్లపల్లి బాలరాజు, డివైఎఫ్ఐ మండల అధ్యక్ష, కార్యదర్శులు శానకొండ రామచంద్రం, మెట్టు శ్రవణ్ కుమార్, ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షులు గంటపాక శివకుమార్, ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి పుట్టల ఉదయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# నవంబర్ నుంచి బంగారం తవ్వకాలు..



**కర్నూలు,** రాయి రాయి అన్నది ఒకనాటికి రత్నమవునురా. బంగారం లాంటి ఈ మాట ఇప్పుడు రాయలసీమలో బంగారం ఉత్పత్తికి బాటలేసింది. ఇన్నాళ్లు నెర్రలు బాసిన నేలలో ఇప్పుడు ఇక కనకధారే. అవును.. కరువుకు కేరాఫ్‌గా నిలిచిన కర్నూలు సీమ ఇప్పుడు ఆత్మనిర్భర్ భారత్‌కు సిరుల సిగ కాబోతోంది. కర్నాటక గోల్డ్ ఫీల్డ్‌ను మించి తుగ్గలి మండలంలో జొన్నగిరి గోల్డ్ ప్రాజెక్ట్‌లో భారీ మైనింగ్‌కు రంగం సిద్ధమైంది. దేశంలోనే మొట్ట మొదటి అతిపెద్ద ప్రవేటు గోల్డ్ మైన్‌గా కర్నూలు రికార్డు క్రియేట్ చేయబోతుంది. తుగ్గలి మండలం బొల్లవానిపల్లి గ్రామంలో గోల్డ్ మైనింగ్ ప్రారంభిస్తున్నట్టు జియో మైసూర్ సర్వీసెస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ప్రకటించింది. పసిడి ధరలు రికార్డు స్థాయిలో ఆకాశన్నంటుతున్న వేళ డెఫినెట్‌గా ఇది బంగారంలాంటి మాటే. స్వాతంత్ర్యం వచ్చాక ఇప్పటి వరకు దేశంలో అతిపెద్ద ఫస్ట్ ప్రయివేటు గోల్డ్ మైన్ ఇదే.వానొస్తే కర్నూలు జిల్లా తుగ్గలి, పగిడిరాయి, తుగ్గలి, జొన్నగిరి సహా చుట్టుపక్కల గ్రామాల్లో వజ్రాలవేట జోరుగా సాగేది. అంతేకాదు నెర్రలు బాసిన ఈ నేలలో బంగారు నిక్షేపాలున్నాయని పరిశోధనల్లో తేలింది. అలా తుగ్గలి మండలం బొల్లవానిపల్లి గ్రామం దగ్గర జియో మైసూర్ సర్వీసెస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో జొన్నగిరి గోల్డ్ ప్రాజెక్టును ఏర్పాటు చేశారు. బంగారం, వెండి వంటి ఖనిజాల వెలికితీతలో ఎంతో అనుభవం వున్న త్రివేణి త్రివేణి ఎర్త్ మూవర్స్, లాయ్‌లాడ్స్ మెటల్ అండ్ ఎనర్జీ లిమిటెడ్, దక్కన్ గోల్డ్ మైన్స్ భాగస్వామ్యంతో జొన్నగిరి గోల్డ్ ప్రాజెక్ట్ రాయలసీమలో సువర్ణ శకానికి తెరలేచింది.జియో మైసూర్ సర్వీసెస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ 70 శాతంతో ప్రధాన వాటాదారులైన త్రివేణి సంస్థ ఎండీ ప్రభాకరన్ %% జొన్నగిరి గోల్డ్ ప్రాజెక్ట్ త్వరలో మైనింగ్ చేపడుతామని ప్రకటించారు. ఏడాదికి 500 కేజీల ఉత్పత్తి లక్ష్యంగా త్వరలో పనులు ప్రారంభిస్తామన్నారు. ఏటా టన్ను బంగారం ఉత్పత్తి చేసేలా ప్రణాళికలు సిద్దంచేసినట్టు చెప్పారాయన. భవిష్యత్తులో ఇక్కడ బంగారం ఉత్పత్తి మరింత పెరిగే అవకాశం ఉందన్నారు. ప్రస్తుత కొత్తగా నిర్మించిన ప్లాంట్‌లో ట్రయల్ రన్ కొనసాగుతుందన్నారు. భారత్ ఆత్మనిర్భర్ సంకల్పానికి జొన్నగిరి గోల్డ్ ప్రాజెక్ట్ బాసటగా నిలుస్తుందన్నారు. బంగారం ఉత్పత్తితో పాటు సామాజిక బాధ్యతగా పరిసర గ్రామాల అభివృద్ధి, ప్రజా సంక్షేమానికి తామ ప్రాజెక్ట్ చేయూతనిస్తుందన్నారు ప్రభాకరన్. భూములిచ్చిన రైతు కుటుంబాలకు, స్థానిక యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు.

# ధాన్యం కొలుగోలు కేంద్రంను ప్రారంభించిన చైర్మన్ వెంకట్ రామ్ రెడ్డి



**వలిగొండ, అక్టోబర్ 19**
యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం అరూరు గ్రామంలో ప్రాథమిక వ్యవసాయ కేంద్రం లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సింగిల్ విండో చైర్మన్ చిట్టే డి వెంకట్ రామ్ రెడ్డి ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ చిట్టి డి జనార్దన్ రెడ్డి, డిసిసి ఉపాధ్యక్షులు వాకిటి అనంతరెడ్డి, జిల్లా కాంగ్రెస్ నాయకులు బండారు నరసింహారెడ్డి, సింగిల్ విండో డైరెక్టర్ రావుల స్వామి, మత్స్యగిరి గుట్ట ధర్మకర్త బండి రవికుమార్, అరూరు గ్రామ మాజీ మాజీ సర్పంచ్ పోలేపాక చెమ్మయ్య, అరూర్,కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు బుర్ర నరసింహ, పోలేపాక యాదయ్య, చిట్టి డి దామోదర్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు తుమ్మలసంతోష్ కుమార్, ఆవుల బిక్షపతి బైకాని భిక్షం, వేముల ఎట్టయ్య,, జినుకల వెంకటేశం, తదితరులు పాల్గొన్నారు.

# బీజేపీలోకి పెద్దిరెడ్డి ఫ్యామిలీ

**తిరుపతి,**వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి బలమైన కుటుంబం గుడ్ బై చెబుతుందా? కమలం గూటికి చేరుతుందా? బిజెపిలో చేరాల్సిన అనివార్య పరిస్థితి ఎదుర యిందా? ఏపీ పొలిటికల్ సర్కిల్లో ఇప్పుడు దీని పైనే చర్చ నడుస్తో ంది. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో ఒక వెలుగు వెలిగిన కుటుంబం ఇప్పుడు కేసుల్లో చిక్కుకుంది. వాటి నుంచి బయటపడాలంటే అధికార పార్టీలోకి వెళ్లడం ఒక్కటే మార్గం. ఆపై సొంత పార్టీ అధినేత నుంచి ఆశించిన స్థాయిలో సహకారం లభించకపో వడంతో.. ఆ కుటుంబం బిజెపిలో చేరేందుకు అన్ని ఏర్పాట్లు చేసుకు న్నట్లు ప్రచారం నడుస్తోంది. ఏపీలో ఇప్పుడు ఇదే హాట్ టాపిక్. ఇంతకీ ఆ ఫ్యామిలీ ఏదంటే పెద్దిరెడ్డి. ఇటీవల పెద్దిరెడ్డి మిధున్ రెడ్డి జైలు నుంచి బయటకు వచ్చారు. అయితే అదే మిధున్ రెడ్డిని ఇప్పుడు కేంద్రం ఐక్యరాజ్యసమితి సమావేశాలకు పంపిస్తుండడం ఈ అనుమా నాలకు బలం చేకూ రుస్తోంది. కూటమి(అధికారం లోకి వచ్చి 15 నెలలు అవుతోంది. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ హయాంలో దూకుడుగా వ్యవహా రించిన నేతలకు కేసుల ఇబ్బం దులు తప్పడం లేదు. చివరకు సోషల్ మీడియాలో అనుచిత వ్యాఖ్యలను చేసిన వారిని సైతం విడిచిపెట్టలేదు. ఈ పరిస్థితుల్లో రాయలసీమను తన ఆధీనంలో ఉంచుకొని పాలించిన పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పై కూటమి ప్రభుత్వం దృష్టి పెట్టింది. ఆయనపై రకరకాల కేసులు నమోదు అయ్యాయి. మరోవైపు మద్యం కుంభకోణం కేసులో పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కుమా రుడు.. మిధున్ రెడ్డి అరెస్ట్ అ య్యారు. రెండు నెలల పాటు రాజమండ్రి సెంట్రల్ జైల్లో రిమాండ్ ఖైదీగా ఉండిపోయారు. ఇటీవల ఆయనకు బెయిల్ లభించింది.అయితే పెద్దిరెడ్డి మిధున్ రెడ్డి జైల్లో ఉన్నప్పుడు జగన్మోహన్ రెడ్డి కనీసం పరామర్శించలేదు. బెయిల్ పై బయటకు వచ్చిన మిధున్ రెడ్డి జగన్మోహన్ రెడ్డిని కలిసేందుకు ఇష్టపడలేదు. అయితే కూటమి అధికారంలోకి వచ్చిన తొలినాళ్లలో వైసిపి ఓటమిపై పోస్టుమార్టం నిర్వహించారు జగన్మోహన్ రెడ్డి. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఓడిపోయింది కానీ.. పెద్దిరెడ్డి కుటుంబం ఎలా గెలిచింది అన్నదానిపై జగన్మో-ౕన్ రెడ్డి విస్మయం వ్యక్తం చేసినట్లు తెలిసింది. ఆ సమయంలోనే టిడిపి తో పెద్దిరెడ్డి కుమ్మక్క య్యారా? అన్న అనుమానాలు కూడా బయటప డ్డాయి. అటు తరువాత ఆ వివా దం ముగిసింది. అయితే అసెంబ్లీకి వైసిపి ఎమ్మెల్యేల హాజరు విష యంలో పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి లీడ్ తీసుకో వాలని జగన్ సూచించారు. అందుకు పెద్దిరెడ్డి రామ చంద్రా రెడ్డి ఒప్పుకోలేదు. అప్పటినుంచి జగన్లో అనుమా నాలు మరింత పెరిగాయి అన్న ప్రచారం సాగుతోంది. ఐక్యరాజ్యసమితి సమావేశాలకు బిజెపి ఎంపీ పురందేశ్వరి నేతృత్వంలో అన్ని పార్టీల పార్లమెంటు సభ్యులను ఎంపిక చేశారు. అయితే ఏపీ నుంచి ఆ బృందంలో వైసీపీ ఎంపీ పెద్దిరెడ్డి మిధున్ రెడ్డి కూడా ఉన్నారు. ఏపీలో కూటమి ప్రభుత్వం నుంచి అభ్యంతరాలు వచ్చినా బిజెపి పెద్దలు మాత్రం మిధున్ రెడ్డిని ఎంపిక చేశారు. దీంతో పెద్దిరెడ్డి కుటుంబం బిజెపికి దగ్గర అయి ందన్న ప్రచారం జోరుగా సాగుతోంది. అయితే ఎట్టి పరిస్థితుల్లో పెద్దిరెడ్డి వైసీపీకి గుడ్ బై చెప్పరని ఆ పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. కానీ క్షేత్రస్థా యిలో పరిస్థితులు చూస్తుంటే మాత్రం పెద్దిరెడ్డి కుటుంబం కమలం గూటికి వెళ్లడం ఖాయం అని తెలుస్తోంది. మరి ఏం జరుగుతుందో చూడాల

# ఒకే గొడుకు కిందకు నాలుగు బ్యాంకులు

**విజయవాడ,** ఏపీలో ఇక రకరకాల పేర్లతో గ్రామీణ బ్యాంకులు కనిపించవు. ఒకే ఒక గ్రామీణ బ్యాంకు ఇకనుంచి కొనసాగనుంది. కొద్ది రోజుల కిందట కేంద్ర ప్రభుత్వం బ్యాంకుల విలీనంపై ప్రకటన చేసింది. నాలుగో విడత బ్యాంకుల విలీనంపై గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. ఒకే దేశం- ఒకే ఆర్ఆర్బీ కింద దేశంలోని పలు రాష్ట్రాల్లో ఎక్కువగా ఉన్న గ్రామీణ బ్యాంకులను ఏకీకరించాలని నిర్ణయం తీసుకుంది. అంటే ఒక్కో రాష్ట్రంలో ఒక గ్రామీణ బ్యాంకుపేరు కొనసాగించనుంది. దీంతో ఏపీవ్యాప్తంగా ఉన్న నాలుగు గ్రామీణ బ్యాంకులు.. ఒకే గ్రామీణ బ్యాంకు గొడుగు కిందకు రానున్నాయి.ప్రస్తుతం ఏపీలో ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్, చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్, ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్, సప్తగిరి గ్రామీణ బ్యాంక్ శాఖలు ఉన్నాయి. ఇవన్నీ ఒకే సంస్థ కిందకు రానున్నాయి. ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు గా మారనున్నాయి. ఈ లెక్కన ఇకనుంచి ఈ గ్రామీణ బ్యాంకుల నేవి కనిపించవు. ఈ విలీన ప్రక్రియలో భాగంగా ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు ఒక ఉత్తర్వులు జారీ చేసింది. ఐదు రోజులపాటు బ్యాంకు సేవలను నిలిపి వేస్తున్నట్లు ప్రకటించింది. అక్టోబర్ 9 సాయంత్రం 6:00 నుంచి.. అక్టోబర్ 13 ఉదయం 10 గంటల వరకు ఈ ఐదు బ్యాంకుల సేవలు నిలిచిపోను న్నాయి.



# 'క్రిష్ 4'లో రష్మిక మందన్నా..

**బీ-టౌన్‌లో వైరల్ అవుతున్న క్రేజీ న్యూస్!**

బాలీవుడ్ స్టార్ నటుడు హృతిక్ రోషన్ దర్శకత్వంలో రాబోతున్న చిత్రం క్రిష్ 4. ఈ సినిమాతోనే హృతిక్ రోషన్ మెగాఫోన్ పడుతున్నాడు. హృతిక్ రోషన్ హీరోగా నటించిన సూపర్ హీరో చిత్రం క్రిష్ ఎంత పెద్ద హిట్టయిందో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. అప్పటివరకు హాలీవుడ్ సూపర్ హీరోలు మాత్రమే తెలిసిన ప్రేక్షకులకు ఇండియన్ సూపర్ హీరోగా హృతిక్ రోషన్ అలరించాడు. కోయి మిల్ గయా, క్రిష్, క్రిష్ 3 సినిమాలు రాగా బ్లాక్ బస్టర్ అందుకున్నాయి. ఇప్పుడు ఇదే ఫ్రాంచైజీ నుంచి క్రిష్ 4 రాబోతుంది. మొదటి మూడు పార్టులకు హృతిక్ రోషన్ తండ్రి రాకేష్ రోషన్ దర్శకత్వం వహించగా.. తాజాగా వచ్చే క్రిష్ 4కి హృతిక్ దర్శకత్వం వహిస్తున్నాడు. దాదాపు రూ.700 కోట్ల బడ్జెట్‌తో ఈ సినిమా తెరకెక్కుతుంది. అయితే ఈ ప్రాజెక్ట్‌లో కథానాయికకు సంబంధించి ఒక క్రేజీ వార్త బీ టౌన్‌లో చక్కర్లు కొడుతుంది. ఈ సినిమాలో కథానాయికగా రష్మిక మందన్నా నటించే అవకాశం ఉందని వార్తలు వస్తున్నాయి. అయితే, ఇది ఇంకా అధికారికంగా ధృవీకరించబడలేదు. కొన్ని బాలీవుడ్ వర్గాల సమాచారం ప్రకారం, క్రిష్ 4 టీమ్ రష్మికను ఒక కీలక పాత్ర కోసం సంప్రదించిందని ఆమె కథకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందని తెలుస్తోంది. త్వరలోనే దీనిపై అధికారిక ప్రకటన వచ్చే అవకాశం ఉంది. గతంలో 'క్రిష్' ఫ్రాంచైజీలో ప్రియాంక చోప్రా హీరోయిన్‌గా నటించారు. అయితే ఈసారి మేకర్స్ కొత్త హీరోయిన్ కోసం చూస్తున్నట్లు తెలుస్తుంది. ఇందులో భాగంగానే రష్మిక పేరు వినిపిస్తుంది.

# సుధీర్ బాబు జటాధర ప్రమోషన్స్ టైం..

**బిగ్ బాస్ సీజన్ 9లో ధన పిశాచి టీం సందడి**



టాలీవుడ్ యాక్టర్ సుధీర్ బాబు నటిస్తోన్న సూపర్ న్యాచురల్ థ్రిల్లర్ జటాధర వెంకట్ కల్యాణ్ కథనందిస్తూ దర్శకత్వం వహిస్తున్న ఈ మూవీ నవంబర్ 7న తెలుగు, హిందీ భాషల్లో గ్రాండ్‌గా విడుదల కానుంది. ఈ నేపథ్యంలో మేకర్స్ ప్రమోషన్స్‌లో బిజీగా ఉన్నారు. ప్రమోషన్స్‌లో భాగంగా విడుదల చేసిన సోనాక్షి సిన్హా ధన పిశాచి లుక్ నెట్టింట వైరల్ అవుతోంది. కాగా ధన పిశాచి టీం ప్రమోషన్స్‌లో భాగంగా బిగ్ బాస్ సీజన్ 9లో సందడి చేసింది. ఈ సందర్భంగా సుధీర్ బాబు త్రిశూలాన్ని పట్టుకొని వచ్చి స్పెషల్ అట్రాక్షన్ గా నిలిచాడు. జటాధర టీం సినిమా విశేషాలను షేర్ చేసుకున్నారు. దీనికి సంబంధించిన ఫొటోలు నెట్టింట వైరల్ అవుతున్నాయి. జటాధర టీం తెలుగు ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు తెలియజేశారు. పోస్టర్ చూస్తుంటే ఇందులో సోనాక్షి సిన్హా డబ్బు పిచ్చి ఉన్న వ్యక్తి పాత్రలో కనిపించబోతున్నట్టు హింట్ ఇచ్చేశారు మేకర్స్. ఇటీవలే ఈ మూవీ నుంచి సోల్ ఆఫ్ జటాధర ట్రాక్ ప్రోమోను విడుదల చేయగా.. ఓం నమ : శివాయ్ అంటూ సాగుతున్న ప్రోమో గూస్‌బంప్స్ తెప్పిస్తోంది. ఇప్పటికే లాంచ్ చేసిన పోస్టర్లలో ఓ వైపు శివుడు మరోవైపు చేతిలో త్రిశూలాన్ని పట్టుకున్న సుధీర్‌బాబు, ఇంకోవైపు ఉగ్రరూపంలో కనిపిస్తున్న సోనాక్షి సిన్హా లుక్స్ సినిమాపై అంచనాలు అమాంతం పెంచేస్తున్నాయి. ఈ మూవీలో బాలీవుడ్ భామ సోనాక్షి సిన్హా ఫీ మేల్ లీడ్ రోల్ పోషిస్తుండగా.. శిల్పా శిరోద్కర్ కీలక పాత్రలో నటిస్తోంది.



# తప్పుడు వార్తలు నమ్మొద్దు!

సోమవారం సాయంత్రం సోషల్ మీడియా అంతటా ఓ షాకింగ్ రూమర్ వైరల్ అయ్యింది. 'సినీనటి కాజల్‌కు యాక్సిడెంట్.. పరిస్థితి విషమం..' అనేది ఆ రూమర్ సారాంశం. ఈ వార్త చూసి నమ్మేసిన కొందరు నెటిజన్లు, ఆందోళనతో కాజల్‌ను ట్యాగ్ చేస్తూ పోస్టులు పెట్టారు. దాంతో కాజల్ స్పందిస్తూ.. 'నా ఆరోగ్యం విషమంగా ఉందంటూ ఓ వార్త సోషల్ మీడియాలో బాగా వైరల్ అవుతోంది. కొందరైతే ఇంకాస్త ముందుకెళ్లి అసలు 'నేను లేను' అంటూ కూడా పోస్టులు పెట్టేస్తున్నారు. వాటిని చూసి నవ్వుకున్నాను. ఎందుకంటే అంతకు మించిన ఫన్నీ న్యూస్ వేరొకటి ఉండదు. ఇలాంటి తప్పుడు వార్తలు ఎవరూ నమ్మొద్దు. అవన్నీ అవాస్తవాలు. దేవుడి దయవల్ల నేను క్షేమంగా.. సురక్షితంగా ఉన్నాను. దయచేసి ఇలాంటి అబద్ధాలను ప్రచారం చేయకండి ప్లీజ్' అంటూ వాపోయారు కాజల్ అగర్వాల్. ప్రస్తుతం ఆమె బాలీవుడ్ 'రామాయణ'లో మండోదరిగా నటిస్తున్న విషయం తెలిసిందే.



# ఏంటీ బ్యూటీ డల్‌గా ఉన్నావు..

అందాల ముద్దుగుమ్మ భాగ్య శ్రీ బొర్సే గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. ఈ అమ్మడు చిత్ర పరిశ్రమలోకి ఎంట్రీ ఇచ్చి చాలా తక్కువ సమయమే అయినప్పటికీ యూత్‌లో మాత్రం మంచి క్రేజ్ సొంతం చేసుకుంది. ఈ మధ్య ఎవరినోట విన్నా ఈ అమ్మడు పేరే వినిపిస్తుంది. అంతలా తన అందంతో అందరినీ మాయ చేసింది ఈ బ్యూటీ. భాగ్య శ్రీ బొర్సే మాస్ మహారాజ్ రవితేజ సరసన మిస్టర్ బచ్చన్ మూవీలో నటించి మంచి ఫేమ్ సంపాదించుకుంది. ఈ మూవీలో ఈ అమ్మడు నటన, గ్లామర్‌కు ప్రతి ఒక్కరూ ఫిదా అయిపోయారు.